దివ్యాంగులకు పరికరాలు పంపిణీ

దివ్యాంగులకు పరికరాలు అందజేస్తున్న లైన్ నెస్ క్లబ్ సంస్థ ప్రెసిడెంట్ సంజుక్త, ఆలయ ప్రతినిధులు

సైదాబాద్, సెప్టెంబర్ 19 : లైన్ నెస్ క్లబ్ సంస్థ ఆధ్వర్యంలో సైదాబాద్ లక్ష్మీనగర్ కాలనీ షిరిడీ సాయిబాబా ఆలయంలో దివ్యాంగులకు, వృద్ధులకు గురువారం పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ సంజుక్త, షిరిడీ సాయిబాబా ఆలయ కమిటీ ప్రతినిధులు సాంబశివశాస్త్రి, నేరెళ్ల ప్రసాదరావు హాజరై దివ్యాంగులకు నడక కర్రలు, వృద్ధులకు చేతి కర్రలు, పేదలకు స్టెచ్చర్స్ అందజేశారు. ఈ సందర్భంగా సంజుక్త మాట్లాడుతూ దివ్యాంగులకు, పేద ప్రజలకు, వృద్ధులకు సేవ చేయటమే తమ సంస్థ లక్ష్యమని, ఆ దిశగా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా ఆలయ కమిటీ ప్రతినిధులు, క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకు ముందుకురావాలి

గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తాను సత్కరిస్తున్న చిలుక ఉపేందర్‌రెడ్డి తదితరులు

ఆర్కేపురం, సెప్టెంబర్ 19 : ఆర్కేపురం డివిజన్ వాసవి కాలనీలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. సుదీర్ఘకాలంగా కాలనీ అభివృద్ధికి కృషి చేసిన సంక్షేమ సంఘం అధ్యక్షులు, అష్టలక్ష్మి దేవాలయ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తాను గణేశ్ ఉత్సవ కమిటీ చైర్మన్ చిలుక ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌గుప్తా మాట్లాడుతూ సత్కారాలతో బాధ్యత మరింత పెరుగుతుందన్నారు. సమాజ, ఆధ్యాత్మిక సేవకు వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

నిమజ్జనం పేరుతో నిధులు దుబారా

- కౌన్సిల్‌లో అడ్డగోలుగా తీర్మానాలు
- గణనాథులను వేసేందుకు నాలుగు క్రేన్లు ఏర్పాటు
- అదనంగా మరో ఆరు క్రేన్లు పెట్టినట్లు తీర్మానం
- చెరువు చుట్టూ కట్టెలు.. బారికేడ్లు పెట్టినట్లు చూపిన వైనం
- బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో భారీగా నిధులు గోల్ మాల్

బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్

బడంగ్‌పేట, సెప్టెంబర్19: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రజల సొమ్మును ఫలహారంలా పంచేస్తున్నారు. నిధులు దుబారాగా ఖర్చు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గణనాథుడి నిమజ్జనం పేరుతో మున్సిపల్ నిధులకు గండి కొడుతున్నారు. గణనాథులను నిమజ్జనం చేసేందుకు నాలుగు క్రేన్లు పెడుతున్నట్లు తీర్మానించారు. ఒక్కో క్రేనుకు రూ.5లక్షలు కేటాయిస్తున్నట్లు కౌన్సిల్ సమావేశంలో వెల్లడించారు. అల్మాస్‌గూడ కొమటి కుంటలో ఒకక్రేను, నాదర్గుల్ సున్నం చెరువు దగ్గర ఒక క్రేను, బాలాపూర్ పెద్ద చెరువు దగ్గర ఒక క్రేను, మల్లాపూర్ సుద్దమోని కుంట దగ్గర మరొక క్రేను ఏర్పాటు చేస్తున్నట్లు ఆగస్టు 16న కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు. వినాయక చవితి రావడంతో నిమజ్జన కార్యక్రమాలకు సంబంధించిన పనులకు టెండర్ వేశారు. టెండర్ ప్రక్రియ కూడా పూర్తి అయింది. ఒక్క క్రేనుకు రూ.5లక్షలు కాగా మరో రెండు అదనంగా మొబైల్ క్రేన్లు ఏర్పాటు చేసినట్లు తీర్మానంలో పేర్కొన్నారు. మొబైల్ క్రేన్లకు మరో రూ.4లక్షలు కేటాయించారు. నిమజ్జనం రోజు క్రేన్లు పని చేయకపోతే సదరు కాంట్రాక్టర్ బాధ్యత తీసుకోవాలి. టెండర్ వేసిన తర్వాత అధికారులు అదనంగా క్రేన్లు పెట్టడంపై కొంత మంది కార్పొరేటర్లు సైతం అభ్యంతరాలు తెలుపుతున్నారు. అందుకు సంబంధించిన సిబ్బందిని కూడా సదురు కాంట్రాక్టరు నియమించుకోవలసి ఉంటుంది. కాని బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో మాత్రం అన్ని పనులు మున్సిపల్ సిబ్బంది ద్వారానే చేయించారు. కొత్తగా ఎక్కడ కూడా సిబ్బందిని ఏర్పాటు చేయలేదు. చెరువుల దగ్గర లైట్లు ఏర్పాటు చేయడానికి రూ.5 లక్షలు, చెరువు కట్టల దగ్గర బారికేడ్లు ఏర్పాటు చేయడానికి రూ.5లక్షలు, టెంట్లు వేయడానికి రూ.5లక్షలు, చెరువు కట్టల దగ్గర చెట్లు కటింగ్ చేయడానికి రూ.5లక్షలు, రోడ్లు లెవలింగ్ చేయడానికి, గుంతలు పూడ్చడానికి రూ.5లక్షలు, వేయిట్ మిక్స్‌తో గుంతలు పూడ్చడానికి రూ.5లక్షలు, మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయడానికి రూ.5 లక్షలు, గజ ఈతగాళ్లకోసం రూ.2లక్షలు, ఉచిత మెడికల్ క్యాంప్‌నకు రూ.లక్ష, ప్లెక్సీలు బ్యానర్లకు రూ.లక్ష, బీటీ రోడ్డు రికార్పెటింగ్ వేయుటకు రూ.5లక్షలు, శివాజీ చౌక్ వద్ద రికార్పెటింగ్ వేయుటకు రూ.5లక్షలు, హోల్స్ ఫిలింగ్ చేయుటకు రూ.5 లక్షలు ఇలా చెప్పుకుంటూ పోతే అనేక రకాలుగా నిధులు దుబారా అయినట్లు తెలుస్తుంది. నాలుగు చెరువుల దగ్గర ఎక్కడ కూడా గజ ఈతగాళ్ల ఆనవాళ్లు మాత్రం కన్పించలేదు. చెరువు కట్టలపై చెట్లను కటింగ్ చేసిన దాఖలాలు కన్పించలేదు. బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు రికార్డు చేస్తున్నారు. చెరువుల చుట్టూ కట్టెలు కట్టి బారికెడ్లు పెట్టినట్లు చూపించారు. చెరువుల దగ్గర లైటింగ్ కోసం లక్షలు వెచ్చించారు. నిమజ్జనం సందర్భంగా బీటీ రోడ్లు వేసినట్లు, రికార్పెట్లు వేసినట్లు లక్షల్లో నిధులు కేటాయించారు. చేసింది గోరంత అధికారులు చూపిందికొండంత అన్నట్లు ఉంది. దీంతో బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ లో నిధులు దుబారా ఇష్టాను సారంగా జరుగుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టెండర్లు లేకుండానే కోట్లలో ముందస్తు పనులు చేయడం, చేయని వాటికి పనులు చేసినట్లు చూపించుకోవడం సర్వ సాధారణం అయిందన్న విమర్శలు వస్తున్నాయి. పాలక వర్గానికి, అధికారుల మధ్యన సమన్వయంతోనే ఈ తతంగం జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధికారుల మాయాజాలం..

బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో నిధుల గోల్ మాల్ అంతా అధికారుల మాయాజాలంలో నడుస్తోందని విమర్శలు వస్తున్నాయి. గతంలోంచి అనేక ఆరోపణలు వస్తున్నా అధికారులు మాత్రం వినివిననట్లు చూస్తున్నారు. ఎప్పుడో అయిపోయిన పనులు ఇప్పుడు తీర్మానాలు చేయడం, కౌన్సిల్ సమావేశంలో పెట్టడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. ఇదంతా పై అధికారులు దృష్టి సారించక పోవడంతో అధికారులు ఆడిందే ఆటగా మారింది.

నాలుగు క్రేన్లు పెట్టాం

బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గణనాథులను నిమజ్జనం చేయడానికి నాలుగు క్రేన్లను ఏర్పాటు చేశాం. ఒక క్రేన్ అదనంగా పెట్టాం. ఏదైనా క్రేన్ చెడిపోతే సదురు కాంట్రాక్టర్ అదనంగా క్రేన్ అందుబాటులో ఉంచుకోవాలి. అయితే కాంట్రాక్టర్‌కు సంబంధం లేకుండా ఏర్పాటు చేశాం. వాస్తవానికి కాంట్రాక్టర్ చూసుకోవాలి. అదనంగా రెండు క్రేన్లను అందుబాటులో ఉంచుకున్నాం.

-కమిషనర్ రఘుకుమార్

పారిశుధ్య కార్మికులకు సన్మానం

మీర్‌పేట మున్సిపల్ శానిటేషన్ సిబ్బందిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, సెప్టెంబర్19: మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మంత్రాల చెరువు దగ్గర గణనాథుల నిమజ్జన కార్యక్రమంలో బాగా పనిచేసిన పారిశుధ్య సిబ్బందిని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఘనంగా సత్కరించారు. నగర నలుమూలల నుంచి వచ్చిన గణనాథులను నిమజ్జనం చేయడంతో ఎమ్మెల్యే వారిని అభినందించారు. పారిశుధ్యం లోపించ కుండా చాలా జాగ్రత్తలు తీసుకున్నారని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేశ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆడపిల్లలకు బాల్య వివాహాలు చేయొద్దు

మాట్లాడుతున్న మహేశ్వరం సీడీపీవో శాంతి శ్రీ

కందుకూరు, సెప్టెంబర్ 19 : ఆడపిల్లలకు బాల్య వివాహాలు చేయవద్దని మహేశ్వరం ప్రాజెక్టు సీడీపీవో శాంతి శ్రీ తెలిపారు. తెలిసి తెలియని వయసులో వివాహాలు చేసినట్లయితే ఇబ్బందులు పడుతారని తెలిపారు. మండల పరిధిలోని కొత్తూరు గ్రామ పంచాయతీలో గల టీఎస్‌డబ్లూఆర్ఎస్ జేసీ పాఠశాలలో (బాలికల ప్రభుత్వ గురుకుల పాఠశాల, కళాశాల),లో విద్యార్థులకు పోషకాహారం,పరిశుభ్రతపై అవగాహన సదస్సును నిర్వహించారు.విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి, తీసుకోకూడని జంక్ ఫుడ్స్ గురించి వివరించారు.విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఎంత వరకు చదువుకుంటారో అంతవరకు చదివించాలి కాని బాల్య వివాహాలు బలవంతంగా చేయవద్దని తల్లి తండ్రులకు వివరించారు. ఆడపిల్లలకు సమాజంలో మంచి గుర్తింపు ఉందని చెప్పారు. ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, రాచులూరు ప్రభుత్వ ఆసుపత్రి డాక్టరు సంధ్యారాణి, వాజిద్, బానుచంద్, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు ఇందిర, సబిత పాల్గొన్నారు.

వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించాలి

వ్యవసాయ యూనివర్సిటీ, సెప్టెంబర్ 19 : దేశంలో వ్యవసాయ అనుబంధ రంగాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత ప్రోత్సహించాలని ఆంధ్ర ప్రదేశ్ ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ (ఏఎన్‌జీఆర్‌ఏయూ) వైస్ చాన్స్‌లర్ డాక్టర్ శారదాజయలక్ష్మీదేవి అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్ర నగర్ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫ్ ఇండియా(పీపీఏఐ) అధ్యక్షుడు డాక్టర్ శరత్ బాబు ఆధ్వర్యంలో జరిగే రెండు రోజుల సదస్సుకు గురువారం మొదటిరోజు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారత్‌లో వ్యవసాయ అనుబంధ రంగాలపైనే ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎక్కువ ఉపాధి అవకాశాలున్నాయన్నారు. దేశానికి అన్నం పెట్టే రంగాన్ని నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. వ్యవసాయ రంగంలో పురుగుమందులు, జీవ రసాయనాల వాడకంపై సుధీర్ఘ చర్చజరిగింది. పీజేటీఎస్‌ఏయూ రిజిస్ట్రార్ డాక్టర్ రఘురామిరెడ్డి మాట్లాడుతూ రైతులకు సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై వీడియో, ఆడియో మాధ్యమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు.

విద్యార్థులకు పోషకాహారంపై అవగాహన

నెహ్రూ మెమోరియల్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆయుష్ ప్రతినిధులు

సైదాబాద్, సెప్టెంబర్ 19 : కేంద్రీయ ఆయుర్వేద విజ్ఞాన పరిశోధన పరిషత్ (ఆయుష్) ఆధ్వర్యంలో 7వ,రాష్ట్రీయ పోషణ్ మహ్-2024 కార్యక్రమంలో భాగంగా గురువారం మలక్‌పేట ప్రభుత్వ నెహ్రూ మెమోరియల్ హైస్కూల్‌లో విద్యార్థులకు పోషకాహారం, ఆయుర్వేదంపై అవగాహన కల్పించారు. ఆయుష్ సీనియర్ పరిశోధకుడు డాక్టర్ వైరముత్తు, డాక్టర్ భార్గవి మాట్లాడుతూ విద్యార్థులు రక్తలేమి(రక్తహీనత) పెరుగుదల పర్యవేక్షించడం, శిశువులకు అదనపు ఆహారం, పోషణతో పాటు చదువు, మైరుగైన ఆరోగ్యం కోసం సాంకేతిక పరిజ్ఞానం అనేక అంశాలపై దృష్టి సారించాలని వివరించారు. విద్యార్థులు మెరుగైన ఆరోగ్యం కోసం ఆయుష్ జీవనశైలి పద్ధతులను విద్యార్థులు పాటించాలని వారు సూచించారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని ఆయుష్ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఇన్‌చార్జి డాక్టర్ జీపీ ప్రసాద్ మార్గదర్శకత్వంలో కొనసాగగా లైబ్రేరియన్ శ్రీనివాసరావు, హెచ్ఎం సుజాత, టీచర్లు మీనా, పద్మావతి పాల్గొన్నారు.

మిని ట్యాంక్‌బండ్‌లో వ్యర్థాల తొలగింపు

వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది

ఎల్బీనగర్, సెప్టెంబర్ 19: సరూర్‌నగర్ మిని ట్యాంక్‌బండ్‌లో గణేశ్ నిమజ్జన అనంతరం చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగిస్తున్నారు. సరూర్‌నగర్ మినీ ట్యాంక్ బండ్‌లో నిమజ్జన కార్యక్రమం ఇంకా కొనసాగుతూనే ఉంది. గురువారం పదుల సంఖ్యలో వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగింది. అయితే నిమజ్జనం అయిన వినాయక విగ్రహాల నుంచి వచ్చే వ్యర్థాల తొలగింపు కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టారు. ఇనుప వస్తువులను క్రేన్ సహాయంతో వెలికితీసి బండ్ గట్టుపైనే పెడుతున్నారు. వాటిని వాహనాల్లో తరలించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మొత్తంగా సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌లో నిమజ్జన కార్యక్రమం విజయవంతమైనది.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా విష్ణుప్రియ

కందుకూరు, సెప్టెంబర్ 19 : నేదునూరులోని మోడల్ స్కూల్, కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా విష్ణుప్రియ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పని చేసిన శ్రీధర్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో శంషాబాద్ మండల పరిధిలోని పాలమాకుల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా పని చేసిన విష్ణుప్రియ ను నేదునూరుకు బదిలీ చేయడంతో ఆమె బాధ్యతలు స్వీకరించిన అనంతరం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి మర్యాద పూర్వకంగా ఎంపీడీవో సరిత, తహసీల్దార్ గోపాల్‌ను కలిసి వారిని శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ గీత, పీఈటీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాట్టి శ్రీరాములు పేరునే కొనసాగించాలి

మలక్‌పేట, సెప్టెంబర్ 19: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును యథాతథంగా కొనసాగించాలని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ఒక్క పకటనలో ప్రభుత్వాన్ని కోరారు. విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరునే కొనసాగించాలని గత నెల 4న సీఎం రేవంత్‌రెడ్డికి, అన్ని రాజకీయ పార్టీలకు విన్నవించామని ఆయన తెలిపారు. శుక్రవారం నిర్వహించనున్న మంత్రివర్గ సమావేశంలో పేరు మార్పునకు ఆమోదం తెలుపనున్నారన్న వార్తల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జిల్లా, పట్టణ, మండల, గ్రామ స్థాయి ఆర్యవైశ్య సంఘాలు, ఆర్యవైశ్యులు సంఘటితంగా దీనిని ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. అన్ని సంఘాల తరపున పేరు మార్పును ఖండిస్తూ ప్రకటనలు కూడా విడుదల చేయాలని ఆయన ఆర్యవైశ్య సంఘాలకు సూచించారు.

వినాయక నిమజ్జనంలో ఘర్షణ

పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న మాలల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బేర బాలకిషన్

ఎల్బీనగర్, సెప్టెంబర్ 19: నిమజ్జనానికి గణనాథులను తరలిస్తున్న క్రమంలో రెండు వినాయక మండపాల నిర్వాహకుల మధ్య వివాదం దాడికి దారి తీసింది. బుధవారం అర్ధరాత్రి సరూర్‌నగర్ చెరుకుతోట కాలనీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని తరలిస్తున్న క్రమంలో కొత్తపేట అరబిందో కాలేజీ వద్దకు రాగానే మన్సూరాబాద్‌కు చెందిన జక్కిడి రఘువీర్‌రెడ్డి, ప్రతీక్, విజయ్‌తో వీరికి వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో తాగిన మైకంలో ఉన్న రఘువీర్‌రెడ్డి తన అనుచరులతో చెరుకుతోట కాలనీకి చెందిన ఆవుల స్వరూపరాణిపై దాడికి పాల్పడటంతో పాటుగా కాలనీ సభ్యులు ధన్‌రాజ్, మాలతీ, జస్వంత్, శ్రీజ, సాయితేజ, వరుణ్ తదితరులతో దుర్భాషలాడుతూ కులం పేరుతో దూషించినట్లుగా బాధితులు సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేసి న్యాయం చేయాలంటూ తెలంగాణ మాలల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బేర బాలకిషన్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. సీఐ సైదిరెడ్డి మాట్లాడుతూ నిమజ్జన తరలింపులో చిన్న వివాదం చోటు చేసుకుందని పేర్కొన్నారు. ఈ మేరకు బాధితులను ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

సింగరేణి ఆఫీసర్స్ కాలనీలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ శ్వేత

సైదాబాద్, సెప్టెంబర్ 19 : ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి ఆఫీసర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం కార్పొరేటర్ జంగం శ్వేత శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీ దివ్య గణేశ్ లడ్డూ రూ.6,11,100 లక్షలు

లడ్డూను దక్కించుకున్న సంజనా గైక్వాడ్

ఆర్కేపురం, సెప్టెంబర్ 19 : వినాయకచవితి నవరాత్రులలో భాగంగా ఐకానిక్ ఫార్మ్స్ ఆఫీస్‌లో శ్రీ దివ్య గణేశ్ లడ్డూ వేలం పాటలో సంజనా గైక్వాడ్ రూ.6,11,100 లక్షలకు లడ్డూను సొంతం చేసుకున్నారు. స్వామివారి లడ్డూను సొంతం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.

అల్మాస్‌గూడ గణనాథుడి లడ్డూ రూ.4.20లక్షలు

లడ్డూను దక్కించుకున్న రామిడి కృష్ణారెడ్డి

బడంగ్‌పేట, సెప్టెంబర్19: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలో రామాంజనేయ భక్త భజన మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి లడ్డూను రామిడి కృష్ణారెడ్డి రూ.4.20లక్షలకు దక్కించుకున్నారు. గత సంవత్సరం రామిడి తుఫాన్ రెడ్డి గణనాథుడి లడ్డూను రూ. 4.15లక్షలకు దక్కించుకున్నారు. ఈ సంవత్సరం లడ్డూ ఐదు వేల రూపాయలు ఎక్కువ పలికింది. లడ్డూ వేలం కాగానే గణనాథుడి శోభాయాత్ర ఘనంగా సాగింది. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ధూంధాం పాటలతో ఆకట్టుకున్నాయి. గ్రామ పురవీధుల గుండా శోభాయాత్రను నిర్వహించారు. తీన్మార్ స్టెపులతో యువత డ్యాన్స్‌లు చేశారు. . ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి , బీఆర్ఎస్ పార్టీ బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, మాజీ జడ్పీ టీసీ బంగారు సత్యనారాయణ, కార్పొరేటర్లు రామిడి కవిత రాంరెడ్డి, సంరెడ్డి స్వప్న వెంకట్‌రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, బోయపల్లి దీపిక శేఖర్ రెడ్డి, ముత్యాల లలిత కృష్ణ, మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి, ఉత్సవ కమిటీ నాయకులు బోయపల్లి గోవింద్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, దిండు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రూ.20స్టాంపులు రూ.40కి విక్రయం

- ఎల్బీనగర్‌లో స్టాంపుల కొరత
- నెల రోజులుగా నో స్టాక్
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ప్రజలు

వనస్థలిపురం, సెప్టెంబర్ 19 : ఎల్బీనగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంపుల కొరత వేధిస్తోంది. రూ.20ల నాన్ జ్యుడీషియల్ స్టాంపులు నెల రోజులుగా కార్యాలయంలో అందుబాటులో లేవు, కొన్ని రోజుల నుంచి రూ.100 స్టాంపులు కూడా స్టాక్ లేనట్లు సిబ్బంది పేర్కొంటున్నారు. రూ.20ల స్టాంపు వెండర్లు రూ.30కి, బ్లాక్‌లో రూ.40కి విక్రయిస్తుండడం విశేషం.

విద్యార్థుల ఇబ్బందులు...

ఓ వైపు స్కాలర్‌షిప్‌ల రెన్యువల్ ప్రారంభం కావడంతో విద్యార్థులకు రూ.20ల నాన్ జ్యుడీషియల్ బాండ్ పేపర్ తప్పని సరిగా అవసరం ఉంది. ఎల్బీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నెల రోజులుగా స్టాంపుల కొరత ఉంది. కార్యాలయం కాంప్లెక్స్‌లో ఉన్న స్టాంప్ వెండర్ వద్దకు వెళ్తే రూ.30కి విక్రయిస్తున్నారు. అది కూడా ఒక్కరికీ ఒకే స్టాంపు ఇస్తున్నారు. ఇక బ్లాక్‌లో అయితే రూ.40కి ఎన్ని కావాలన్నా ఇస్తున్నారు. దీనిపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇవే స్టాంపులు వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అందుబాటులో ఉండగా, ఎల్బీనగర్‌లో ఎందుకు లేవన్నది ప్రశ్న. సిబ్బంది జిల్లా రిజిస్ట్రార్‌కు ఇండెంట్ పెట్టడం, తీసుకురావడంలో నిర్లక్ష్యం వహించడం వల్ల కొరత ఏర్పడ్డట్టు తెలుస్తోంది. సదరు సిబ్బంది సబ్ రిజిస్ట్రార్‌కు కూడా స్టాక్‌పై సరైన సమాచారం ఇవ్వడం లేదని తెలుస్తోంది.

ఎల్బీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం